సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం ၊ 16 ၊ సెప్టెంబర్ ၊ 2023



అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ
స్పందనలో స్వీకరించిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. IIలో



ఆర్థికాభివృద్ధి సాధించాలి
బ్యాంకు లింకేజీ రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ కోరారు. IIలో



'టైగర్ నాగేశ్వరరావు' సందడి
ప్రముఖ సినీ హీరో రవితేజ హీరోగా తెరకెక్కిస్తున్న టైగర్ నాగేశ్వరరావు సినిమా షూటింగ్ సందడి నెలకొంది. IIలో

న్యూస్‌రీల్

'జగనన్నకు చెబుదాం'కు విశేష స్పందన
● 94 అర్జీల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్

పెదబయలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. మండలంలోని 16 గ్రామ సచివాలయాలు,23 గ్రామ పంచాయతీల పరిధిలో 94 అర్జీలను స్వీకరించినట్టు ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, తహసీల్దార్ కృష్ణారావు తెలిపారు. పంచాయతీరాజ్- 4, రెవెన్యూ-12, పీఆర్ ఇంజనీరింగ్-20, టీడబ్ల్యూ ఇంజనీరింగ్-8, ఆర్‌డబ్ల్యుఎస్-15, గృహ నిర్మాణ శాఖ-4, విద్యాశాఖ-2,ఐసీడీఎస్- 3,జిల్లా విద్యా శాఖ - 3, పాడేరు ఐటీడీఏ- 3, హార్టికల్చర్- 1, విద్యుత్ శాఖ- 2, జీసీసీ- 2, ఆర్టీసీ- ఒకటి ఉన్నాయని, వీటిని ఆన్‌లైన్ చేస్తామని వారు వివరించారు.

ప్రైవేట్ వర్తకులకు విక్రయించి మోసపోవద్దు
● జీసీసీ డివిజనల్ మేనేజర్ దేవరాజు



చింతపల్లిరూరల్: కాఫీ గింజలను ప్రైవేట్ వర్తకులకు విక్రయించి మోసపోవద్దని గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ పి.దేవరాజు సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ రైతులు పండించిన కాఫీ గింజలను గిరిజన సహకార సంస్థ అపెక్స్ కమిటీ సిఫారసు చేసిన గరిష్ట ధరను గిరిజనులకు అందిస్తున్నట్టు తెలిపారు. కాఫీ రైతులకు రుణాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. చింతపల్లిలో ఐదేళ్లుగా మూతపడిన గిరిజన సహకార సంస్థ సూపర్ మార్కెట్‌ను పునః ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గిరి ప్రజలు జీసీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గంజాయి సాగు చేస్తున్న ఇద్దరి అరెస్టు



నిందితులతో ముంచంగిపుట్టు పోలీసులు

ముంచంగిపుట్టు: గంజాయి పంటను సాగు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసనట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బాబుశాల పంచాయతీ గాజులబంద గ్రామానికి చెందిన గొల్లోరి రాజు, గొల్లోరి దశరథ గంజాయి సాగు చేస్తున్నట్టు స్థానిక పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు గాజులబందకు సమీపంలోని కొండ ప్రాంతంలో రెండు ఎకరాల్లో సుమారు 500 మొక్కలను పోలీసులు గుర్తించారు. సాగు చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి స్థానిక పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. గంజాయి తోటను ధ్వంసం చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మర్రి కామయ్య చరిత్రపై అధ్యయనం



కామయ్య సమాధి వద్ద గుజరాత్‌కు చెందిన అధ్యయన బృందం సభ్యులు

హుకుంపేట: స్వాతంత్య్ర సమరయోధుడు మర్రి కామయ్య చరిత్రపై అధ్యయనం చేస్తున్నట్టు గుజరాత్ గిరిజన సాంస్కృతిక పరిశోధన సంస్థ బృందం సభ్యులు తెలిపారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ ప్రొఫెసర్ పి. శంకర్‌రావు ఆధ్వర్యంలో బృందం సభ్యులు కామయ్యపేటలోని కామయ్య సమాధిని పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ మర్రి కామయ్య పోరాటం, ఆయన చరిత్ర ప్రతి ఒక్కరు తెలుసుకునేలా ప్రదర్శనలో అందుబాటులో ఉంచుతామన్నారు. సమాధిని నందనవనంగా తీర్చిదిద్ది, భారీ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. గుజరాత్ గిరిజన సాంస్కృతిక పరిశోధన బృందం మర్గి పాటిల్, హనోజ్ పాటిల్, విపుల్ రమణి, రాహుల్ ధర్వకార్ గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది ఎస్.సీతారామయ్య పాల్గొన్నారు.

డిజిటల్ శకం

గ్రామ పంచాయతీల్లో డిజిటల్ శకానికి ప్రభుత్వం నాంది పలుకుతోంది. ఇందుకు సంబంధించి నగదు రహిత లావాదేవీలకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రెండు మూడు రోజుల్లో అమల్లోకి రానున్న ఈ విధానం ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత పెంచేందుకు ఎంతగానో దోహదపడుతుందని వారు భావిస్తున్నారు.

- గ్రామ పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- జిల్లావ్యాప్తంగా అమలుకు విస్తృత ఏర్పాట్లు
- నిధుల వినియోగంలో పారదర్శకత
- అవినీతికి ఆస్కారం ఉండదంటున్న అధికారులు



చింతూరు మండలం చట్టి గ్రామ సచివాలయం

చింతూరు: గ్రామ పంచాయతీల్లో ఇప్పటివరకు వివిధ రకాల పన్నులను నగదు రూపంలో వసూలు చేస్తున్నారు. ప్రధానంగా ఇంటిపన్ను, నీటిపన్ను, వృత్తి, వ్యాపార లైసెన్సు తదితర పన్నులను గ్రామ పంచాయతీలు నగదు రూపంలో వసూలు చేస్తున్నాయి. ఇకపై ఈ విధానానికి స్వస్తి పలికి డిజిటల్ లావాదేవీలకు నాంది పలికేందుకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



గ్రామ పంచాయతీ కార్యాలయంలో విధుల నిర్వహణలో సిబ్బంది

440 పంచాయతీల్లో..
జిల్లాలోని 22 మండలాల్లో 430 గ్రామ పంచాయతీలుండగా వీటిలో 10 మేజరు గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో డిజిటల్ చెల్లింపుల కోసం ప్రతి గ్రామ పంచాయతీలో అధికారిక బ్యాంకు ఖాతాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను అనుసంధానం చేసే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. దీంతో పాటు వివిధ రకాల డెబిట్, క్రెడిట్ కార్డులతో పాటు ఇతర డిజిటల్ ప్లాట్‌ఫాంల ద్వారా చెల్లింపులు జరిగేలా ప్రత్యేక మిషన్లను గ్రామ పంచాయతీల్లో సిద్ధం చేస్తున్నారు. వీటిద్వారా ప్రజలు తమ పన్నులను డిజిటల్ విధానంలో చెల్లించవచ్చు.

ఎప్పటికప్పుడు ఆన్‌లైన్..
డిజిటల్ విధానంలో వసూలు వల్ల ఎలాంటి అవినీతికి తావు లేకుండా చర్యలు చేపట్టే ఆస్కారముంది. మరోవైపు డిజిటల్ చెల్లింపుల ద్వారా ఆయా గ్రామ పంచాయతీలకు సంబంధించిన పన్నుల వసూలు లెక్కలు ఎప్పటికప్పుడు తెలిసే అవకాశం ఉంటుంది. ప్రజలు చెల్లించే పన్నులతో పాటు గ్రామ పంచాయతీలు కొనుగోలు చేసే బ్లీచింగ్, వీధిలైట్లు, పారిశుధ్య మెటీరియల్‌తో పాటు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను కూడా డిజిటల్ విధానంలోనే చెల్లిస్తారు.

అవగాహనకు కార్యాచరణ..
ప్రభుత్వం ఇకపై గ్రామ పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులకు నాంది పలుకుతున్న నేపథ్యంలో జిల్లాలోని గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. అయితే జిల్లాలో అత్యధికంగా ఉండే గిరిజన ప్రజలకు, ఇతర నిరక్షరాస్యులకు డిజిటల్ చెల్లింపులపై పెద్దగా అవగాహన ఉండదు. దీంతో వారికి నగదు చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశమున్న నేపథ్యంలో డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు.

> **రెండు మూడు రోజుల్లో ప్రారంభిస్తాం**
> జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో మరో రెండు, మూడు రోజుల్లో అన్ని రకాల పన్ను లను డిజిటల్ విధానంలో చెల్లించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. ఇప్పటికే ఇందుకు సంబంధించి కార్యదర్శులకు పూర్తిస్థాయిలో ఆదేశాలు జారీ చేశాం. క్యూఆర్ కోడ్‌లు అన్ని గ్రామ పంచాయతీలకు సరఫరా చేశాం. – కొండలరావు డీపీవో

సీఎం జగన్‌కు ఘన స్వాగతం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి

సాక్షి, విశాఖపట్నం: విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా విశాఖ ఎయిర్‌పోర్టుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 9.45 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సీఎం హెలికాప్టర్‌లో విజయనగరం జిల్లా ద్వారంపూడికి బయలుదేరి వెళ్లారు. ఆయన తిరిగి మధ్యాహ్నం 2.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం, వీడ్కోలు పలికిన వారిలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ గొడ్డేటి మాధవి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జె. సుభద్ర, జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లే అనురాధ ఉన్నారు. ముఖ్యమంత్రి 2.28 గంటలకు విమానంలో విజయవాడకు తిరుగు పయనమయ్యారు. ముఖ్యమంత్రి వెంట విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తదితరులు ఉన్నారు.

సుస్థిర అభివృద్ధికి కృషి అవసరం
కలెక్టర్ సుమిత్‌కుమార్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: నీతి అయోగ్ సూచనల మేరకు సుస్థిర అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో జరిగిన స్పందన కార్యక్రమంలో భాగంగా 'ప్రేరణ' గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దిష్ట కార్యక్రమాల నిర్వహణకు పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి మండలాలను పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా విద్య, వైద్య, స్త్రీశిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ఆకాంక్ష జిల్లా సహకార బృందం ప్రాజెక్ట్ మేనేజర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ గిరిజన జనాభాతో గుర్తించబడిన ఆకాంక్షాత్మక జిల్లాలో జిల్లా ప్రజల ఆకాంక్షల మేరకు ప్రేరణ బృందాలు కృషి చేస్తున్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్వీస్ డెలివరీ, స్టూడెంట్ లెర్నింగ్ అవుట్‌కమ్ ఎంపిక చేసిన మూడు మండలాల పాఠశాలల్లోని ప్రాథమిక భాష, సంఖ్య కార్యక్రమాల్లో పురోగతిని అర్థం చేసుకునేందుకు బేస్‌లైన్ అధ్యయనాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాసు, ఐటీడీఏ పీవో అభిషేక్, జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, డీఈవో సలీం బాషా, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు కొండలరావు, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే జనసేన, టీడీపీ పొత్తు
పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతోనే జనసేన, టీడీపీ పార్టీలు కలసి పోటీ చేయనున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి విమర్శించారు. మండలంలో శనివారం గడప గడపకు కార్యక్రమం నిర్వహించిన ఆమె ఈ సందర్భంగా మాట్లాడారు. పవన్ కల్యాణ్ ప్రకటనతో మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఆదరణ మరోసారి సుస్పష్టమైందన్నారు. ప్రతి పేదవాడి గుండెల్లో జగన్‌కు ఉన్న ఆదరణను చూసి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ భయపడుతున్నారనేది తేటతెల్లమైందన్నారు. అందుకే వారు పొత్తును బహిర్గతం చేశారన్నారు. జగన్మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కోవడం సాధ్యం కాదని పవన్ కల్యాణ్ స్వయంగా చెప్పిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఎన్ని శక్తులు ఏకమైనా వైఎస్సార్‌సీపీదే విజయమని ఆమె పేర్కొన్నారు.

వేతనం పెంపుతో ఆనందం
● ఐటీడీఏ పీవోకు వెలుగు సిబ్బంది సత్కారం



ఐటీడీఏ పీవో అభిషేక్‌ను సత్కరిస్తున్న వెలుగు ఉద్యోగులు, సిబ్బంది

పాడేరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం వెలుగులో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి వేతనాలు పెంచడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్‌ను వెలుగు అధికారులు, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీడీ మురళి, క్షేత్ర స్థాయి అధికారులు కృష్ణారావు, వైకుంఠరావు, రమణి, వి.ఎస్.ప్రసాద్, సత్యవేణి పాల్గొన్నారు.

ఘాట్‌లో నిలిచిన భారీ వాహనాల రాకపోకలు

మారేడుమిల్లి : మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సోకులేరు వాగు సమీపంలో రహదారిపై బ్రిడ్జి వద్ద కోతకు గురవుతోంది. ఒక పక్కమట్టి జారిపోతున్నందున ఇరువైపులా భారీ వాహనాలను నిలిపివేశారు. చిన్న వాహనాలు, ఆర్టీసీ బస్సులను జాగ్రత్తగా పంపిస్తున్నారు. కోతకు గురైన చోట బ్రిడ్జి కూలిపోకుండా అధికారులు ఇసుక బస్తాలను అమరుస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రయోజనాన్ని తెలియజేయండి
రాష్ట్ర ఆరోగ్యశాఖ నోడల్ అధికారి రమేష్



మాట్లాడుతున్న రాష్ట్ర ఆరోగ్యశాఖ నోడల్ అధికారి రమేష్

చింతపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రయోజనాన్ని ప్రజలకు తెలియజేయాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డాక్టర్ రమేష్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఏఎన్ఎం,హెచ్‌వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం మరింత భరోసా కల్పించే విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష అమలు చేస్తున్న విషయాన్ని ఏఎన్ఎం, హెచ్‌వోలు, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించాలని సూచించారు.గిరిజనుల ఆరోగ్య వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఏజెన్సీలో వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యులు రోగులకు అన్ని వేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు వైద్యాధికారులు పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి



ఇంజనీరింగ్ అధికారులకు శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ, పీవో



మోతుగూడెంలో విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఈ శ్రీధర్, అధికారులు

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరులో ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సదర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన సంక్షేమశాఖ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యుఎస్, గృహనిర్మాణసంస్థ, నీటి పారుదలశాఖ కార్యాలయాల్లో ఇంజినీర్స్‌డే నిర్వహించారు. పాడేరు ఐటీడీఏలో స్పందన కార్యక్రమం అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్ ఇంజనీరింగ్ అధికారులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ పాడేరు, అరకు లోయ ఈఈలు డీవీఆర్ఎం రాజు. కె.వేణుగోపాల్, పంచాయతీరాజ్ ఈఈలు కొండయ్యపడాల్, లావణ్యకుమార్, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందర బాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ లీలాకృష్ణ, గృహనిర్మాణ సంస్థ ఈఈ బాబునాయక్, డీఈఈలు రవికుమార్, మాణిక్యం, అనుదీప్, ప్రకాష్, ఇంజినీరింగ్ అధికారులు బాబుప్రసాద్, సంతోష్ పాల్గొన్నారు.

మోతుగూడెం: లోయర్ సీలేరు జల విద్యుత్ కేంద్రం వద్ద ఇంజనీర్స్ డే నిర్వహించారు. చీఫ్ ఇంజనీర్ బి శ్రీధర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈఈ బాలకృష్ణ, వరప్రసాద్, ప్రసాద్, ఏడీఈలు పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం



నందిగామ వాగుకు పోటెత్తిన గోదావరి వరద నీరు

ఎటపాక: గోదావరి నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. ఎడతెరిపి లేకుండా నాలుగు రోజులుగా కురుస్తున్న వానలకు వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో గోదావరిలో భారీగా వరద నీరు చేరుతోంది. అంతేకుండా ఎగువ ప్రాంతాల నుంచి కూడా వరద గోదావరికి రావడంతో ముంపు భయం విలీన మండలాల ప్రజలను వెంటాడుతోంది. గత నాలుగు రోజులుగా మురుమూరు, నందిగామ, తోటపల్లి, నెల్లిపాక వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువన ఉన్న తాలిపేరు ప్రాజెక్టు, గోదావరి నదిపైన ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండటంతో శుక్రవారం ఉదయం నుంచి గోదావరి వరద క్రమేపీ పెరుగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు 33.3 అడుగులకు చేరింది. మండలంలో ఇప్పటికే రెండు వేల ఎకరాల్లో మిర్చి నాట్లు వేశారు. మరికొంతమంది రైతులు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వారంతా ఆందోళన చెందుతున్నారు.

మత్స్యలింగేశ్వరుడిని దర్శించుకున్న ఉన్నతాధికారి



కమిషనర్ చంద్రశేఖర్‌కు స్వామివారి చరిత్ర పుస్తకాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హుకుంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం మత్యగుండం మత్స్యలింగేశ్వర స్వామిని దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ శుక్రవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయం వద్ద తర తరాలుగా అర్చకులుగా పని చేస్తున్న వారికి ప్రతినెలా గౌరవ వేతనం అందిస్తామన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. ఆలయ చరిత్ర పుస్తకాన్ని అందజేశారు. దేవదాయశాఖ జూనియర్ అసిస్టెంట్ చంద్ర తేజ, అర్చక సమఖ్య జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ పరమ హంస, ఆలయ కమిటీ సభ్యులు అప్పారావు, సూర్యనారయణ, సింహాచలంనాయుడు, కొండబాబు, రాంబాబు, బాలయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

99 శాతం మేర ఓటర్ల సవరణ పూర్తి
● రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్



పార్టీ నేతలతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: ఏజెన్సీ పరిధిలో 11 మండలాల్లో ఓటరు జాబితాల్లో సవరణ ప్రక్రియ 99 శాతం పూర్తయినట్టు రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రంపచోడవరం నియోజకవర్గంలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి సవరణ సర్వే చేపట్టారన్నారు. ఫారం- 6 ద్వారా ఓటు నమోదుకు 809 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఓటరు కార్డులో తప్పులు ఉంటే తెలియజేయాలన్నారు. నియోజకవర్గంలో ఎక్కడైనా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కోరారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి
కలెక్టర్ సుమిత్ కుమార్



లబ్ధిదారుడికి వాహన తాళాలు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో రాజవొమ్మంగి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ మంజూరు చేసిన రూ.13.39 లక్షల విలువైన వాహనాన్ని మత్స్యకారుడు ముమ్మన ఆదినారాయణకు శుక్రవారం అందజేశారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రూ.5.31 లక్షల రాయితీని ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. మిగిలిన రుణాన్ని సకాలంలో బ్యాంకుకు చెల్లించాలని సూచించారు. ప్రభుత్వ పథకాన్ని సక్రమంగా వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్, డీఆర్వో అంబేద్కర్, ఎల్‌డీఎం రవితేజ, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, ఎఫ్‌డీవో రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఊడిపడిన ఆర్టీసీ బస్సు క్యారియర్


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండల కేంద్రం రాజవొమ్మంగి నుంచి ఏలేశ్వరం వెళుతున్న ఆర్టీసీ బస్సు క్యారియర్ మార్గమధ్యంలో గొంటువానిపాలెం వద్ద ఊడి రోడ్డుపై పడింది. ఆ సమయంలో ఇతర వాహనాలు, మనుష్యులు ఎవరూ ఆ మార్గంలో వెళ్లకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రిపేరు అనంతరం బస్సు బయలుదేరింది. ఇదే మార్గంలో రెండు రోజుల కిందట కూడా ఒక బస్సు టాప్ క్యారియర్ ఊడిపడింది.

నేటి నుంచి ఉమ్మడి జిల్లాల క్రీడా పోటీలు

అగనంపూడి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఉమ్మడి విశాఖ సారధ్యంలో శనివారం హాకీ పోటీలు నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు అనకాపల్లి జిల్లాల ఎస్జీఎఫ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఉదయం పది గంటలకు మూడు జిల్లాలకు చెందిన అండర్ -14, 17 బాలురు, బాలికలకు పోటీలు నిర్వహించనున్నారని తెలిపారు. క్రీడాకారులకు పోటీలు నిర్వహించి రాష్ట్ర జట్టును ఎంపిక చేయనున్నట్టు ఆయన తెలిపారు.

24 నుంచి సింహగిరిపై పవిత్రోత్సవాలు

- అన్ని ఆర్జిత సేవలు రద్దు
- రాత్రి 7గంటల వరకు మాత్రమే దర్శనాలు

సింహాచలం : సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు పవిత్రోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు శుక్రవారం తెలిపారు. ఏడాదంతా స్వామికి జరిగే నిత్య సేవలు, విశేష సేవలు, ప్రముఖ ఉత్సవాల రోజుల్లో వైదికపరంగా ఏమైనా దోషాలు ఉంటే వాటిని నివృత్తి చేసేందుకు పవిత్రోత్సవాలను నిర్వహించడం పరిపాటిగా వస్తోందని తెలిపారు. దీనిలో భాగంగా 24వ తేదీ రాత్రి 7గంటల తర్వాత మృత్యం గ్రహణం, అంకురార్పణం, హోమాలు, 25వతేదీ ఉదయం విశేష హోమాలు, పారాయణాలు, రాత్రి ఆదివాసములు, పారాయణాలు, 26వ తేదీ రాత్రి పవిత్ర సమర్పణ, 27 ఉదయం విశేషహోమాలు, రాత్రి పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, రథబలి, 28 ఉదయ ఏకాంత స్నపనం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేంపజేసి వేద పారాయణలు, దివ్యప్రబంధ సేవాకాలం, తిరువీధి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. పవిత్రోత్సవాల సందర్భంగా ఈనెల 24వ తేదీ నుంచి 28వతేదీ వరకు ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలు, నిత్యకల్యాణం రద్దు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే ఈనెల 24నుంచి 28వరకు రాత్రి 7గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు ఉంటాయని చెప్పారు.



సాంకేతిక ప్రగతితో అవకాశాలు

ఏయూలో ప్రారంభమైన యాక్సెస్ 2కే 23 సదస్సు


ప్రసంగిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: సాంకేతిక ప్రగతి నూతన అవకాశాలను సృష్టించే మార్గాలను చూపుతుందని ఏయు ఉపకులపతి ఆచార్య ప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఇంజినీర్స్ డే ని పురస్కరించుకొని సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన యాక్సెస్ 2కే 23 సింపోజియాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ అవకాశాల తలుపులు తెరుచుకుంటున్నాయని వీటిని అందుకోవాల్సిన బాధ్యత నేటితరం యువతపై ఉందన్నారు. సాంకేతికత రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్న విధానం వివరించారు. సమాజ సమస్యలకు పరిష్కారాలను చూపేది ఇంజనీర్లేనని,నేటి సమాజంలో ప్రతి అంశం ఇంజనీరింగ్ తో ముడిపడి ఉందనే వాస్తవాన్ని మనందరం గమనించాలని సూచించారు. భవిష్యత్తును ప్రభావితం చేసే విధంగా నేటి తరం పనిచేయాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. భవిష్యత్తుకు అవసరమైన ప్రణాళిక, సన్నద్ధత చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి కుమార్ రాజా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.కుమార్ రాజా , ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి. శశిభూషణరావు కన్వీనర్ ఆచార్య సి.ఎస్‌వి. సత్యనారాయణరెడ్డి, స్టూడెంట్ కోఆర్డినేటర్ పి. సాత్విక,డాక్టర్ కె.రాజశేఖర్, ఆచార్య ఎస్.కె యజ్ఞాని తదితరులు ప్రసంగించారు.

21న విమ్స్‌లో వైద్యుల పోస్టులకు ఇంటర్వ్యూలు

ఆరిలోవ(విశాఖ): విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో వైద్యులు పోస్టులకు ఈనెల 21న ఇంటర్వ్యూలు నిర్వహించన్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు శుక్రవారం తెలిపారు. 43 మంది సూపర్ స్పెషలిస్టులు, జనరల్ స్పెషలిస్టుల పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. సూపర్ స్పెషలిస్టు వైద్యులకు నెలకు రూ 1.60లక్షలు, జనరల్ స్పెషలిస్టు వైద్యులకు రూ. 92 వేలు వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 21న ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఏపీ మెడకల్ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులు ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. మరిన్నివివరాలుకోసం dme.ap.nic.in అనే వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

వైద్య రంగంలో చారిత్రక ఘట్టం

మహారాణిపేట: రాష్ట్రంలో ఒకే రోజు ఐదు మెడికల్ కాలేజీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించడం వైద్య రంగంలో చారిత్రక ఘట్టమని వైద్య విద్యార్థులు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విజయనగరం వైద్య కళాశాలను ప్రత్యక్షంగా.. నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం వైద్య కళాశాలలను వర్చువల్‌గా ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి ఏఎంసీ ప్రాంగణం నుంచి వైద్య విద్యార్థులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సీఎం ప్రసంగాన్ని తిలకించిన అనంతరం మాట్లాడారు. వైద్య ఆరోగ్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఎంతో విప్లవాత్మకంగా ఉన్నాయని, వైద్య విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, ఏఎంసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మన్మధరావు, డాక్టర్ కృష్ణవేణి, పలు వైద్య విభాగాల హెచ్‌వోడీలు, వైద్యులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ రాధాకృష్ణ, ఏఎంసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మన్మధరావు

న్యూ కోచ్ కేర్ సెంటర్‌లో డీఆర్ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం: మర్రిపాలెంలోని న్యూ కోచ్ కేర్ సెంటర్‌లో శుక్రవారం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తనిఖీలు చేపట్టారు. కోచ్‌ల్లో పరిశుభ్రత, నిర్వహణ, భద్రత చర్యలపై ఆరా తీశారు. కోచ్ కేర్ సెంటర్‌లోని వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రేక్‌తో పాటు మరి కొన్ని రేక్‌లను ఆయన పరిశీలించారు. ప్రయాణికుల ఫీడ్‌బ్యాక్‌ను బట్టి తీసుకోవాల్సిన చర్యలను అధికారులు, సిబ్బందికి వివరించారు. ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల నిర్వహణ, అండర్ గేర్ పార్ట్స్, ఇన్‌సెక్ట్ నియంత్రణ అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీనియర్ కోచ్ డిపో ఆఫీసర్ ప్రవీణ్ భటి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


వందేభారత్ రైలు అండర్ గేర్ పార్ట్స్‌ను తనిఖీ చేస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- స్పందనలో 85 అర్జీల స్వీకరణ

సాక్షి,పాడేరు: స్పందనలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్, డీఆర్వో అంబేద్కర్ ప్రజల నుంచి 85 వినతులు స్వీకరించారు. వీటిని త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీవీ శర్మ, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు, ఈఈలు డీవీఆర్ఎం రాజు, కె.వేణుగోపాల్, పంచాయతీరాజ్ ఈఈ కొండయ్య పడాల్ , గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ లీలాకృష్ణ, డీఎంహెచ్‌వో జమాల్ బాషా పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- కొయ్యూరు మండలం రైతు ఉత్పతిదారుల సంఘానికి కలెక్షన్ సెంటర్ నిర్మాణానికి కొయ్యూరు మండలం శరభన్న పాలెంలో పది సెంట్ల స్థలాన్ని మంజూరు చేయాలని సంస్థ చైర్మన్ పెదరాజబాబు, డైరెక్టర్ ఎస్. సత్యనారాయణ వినతిపత్రం సమర్పించారు.
- పాడేరు మండలం లగిశపల్లిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని చెట్టి క్రాంతి వినతి పత్రం అందజేశారు.
- జి.మాడుగుల మండలం చుట్టు మెట్ట గ్రామస్తుడు వంతాల కృష్ణారావు పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని అర్జీ అందజేశారు.
- హుకుంపేట మండలం మఠం పంచాయితీ ఎం.గన్నేరుపుట్టు గ్రామానికి చెందిన పాంగి కృష్ణ చైతన్య, సికిల్ సెల్ ఎనీమియా పింఛను కోసం దరఖాస్తు చేశారు.
- ముంచంగిపుట్టు మండలం బంగారుమెట్ట పంచాయతీ రావిడిపుట్టు గ్రామానికి తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు గుర్రం అర్జునరావు, పాంగి గురు వినతపత్రంలో కోరారు.

‘టైగర్ నాగేశ్వరరావు’ సందడి


దర్శకుడు వంశీకృష్ణనాయుడు బర్త్‌డే వేడుకలో హీరో రవితేజ,గాయత్రిభరద్వాజ్, అభిషేక్ అగర్వాల్


హీరో రవితేజతో ఫొటోలు దిగుతున్న అభిమానులు

సాక్షి,పాడేరు/అనంతగిరి: ప్రముఖసినీ హీరో రవితేజ హీరోగా తెరకెక్కిస్తున్న టైగర్ నాగేశ్వరరావు సినిమా షూటింగ్ సందడి అరకు, అనంతగిరి ప్రాంతాల్లో నెలకొంది. చిత్రదర్శకుడు వంశీకృష్ణనాయుడు పుట్టినరోజు సందర్భంగా చిత్ర యూనిట్ గురువారం వేడుకలు నిర్వహించింది. హీరోరవితేజ, హీరోయిన్ గాయత్రి భరద్వాజ్, నిర్మాత అభిషేక్ అగర్వాల్ సమక్షంలో దర్శకుడు కేక్ కట్ చేసి అందరికి తినిపించారు. హరితా రెస్టారెంట్, అనంతగిరి గెడ్డ, హోటల్ పరిసర ప్రాంతాల్లో సన్నివేశాలను చిత్రీకరించారు. 1970లో జరిగిన యథార్థ ఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్టు తెలిసింది. తెలుగు,తమిళ్, కన్నడ, హిందీ, మలయాళం భాషల్లో విడుదల చేయనున్నట్టు చిత్రయూనిట్ తెలిపింది. సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా ప్రకాష్‌కుమార్ వ్యవహరిస్తున్నారు. హీరో రవితేజను చూసేందుకు పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చారు. అనంతగిరి ఎంపీడీవో, సిబ్బంది రవితేజతో ఫొటోలు తీసుకున్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

- స్వయం సహాయక సంఘాలకు లింకేజీ రుణాలు
- చెక్కును అందజేసిన ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ సొమ్మును సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. డుంబ్రిగుడ మండలానికి చెందిన 110 స్వయం సహాయక సంఘాలకు రూ.2కోట్ల 50లక్షల 71వేల బ్యాంకు లింకేజీ చెక్కును ఆయన ఐటీడీఏ సమావేశ మందిరంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీడీ మురళి, ఎస్‌డీసీ వి.వి.ఎస్. శర్మ, ఎల్‌డీఎం రవితేజ, వెలుగు సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు. జిల్లాలో గత మూడు విడతల్లో వైఎస్సార్ ఆసరా మంజూరు కానీ 60 డ్వాక్రా గ్రూపులకు రూ.కోటి 12 లక్షల చెక్కును లబ్ధిదారులకు పీవో అందజేశారు.

పునరావాస కాలనీ స్థలాలు సందర్శించిన నిర్వాసితులు



యాదవోలులో స్థలాన్ని పరిశీలిస్తున్న నిర్వాసితులు

చింతూరు: పోలవరం ముంపు ప్రాజెక్టులో భాగంగా ప్రాధాన్యతా క్రమంలో చేర్చిన చింతూరుకు చెందిన గిరిజనేతర నిర్వాసితులు శుక్రవారం పునరావాస కాలనీల స్థలాలను సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లా యాదవోలు, ఏలూరు జిల్లా తాడువాయిలో అధికారులు వారికి స్థలాలను చూపించారు. పీడీఎఫ్ కమిటీ సభ్యులతోపాటు ఇతర గ్రామస్తులు తాము నివసించేందుకు ఇళ్లు నిర్మించబోయే ప్రదేశాలను పరిశీలించారు. తాడువాయిలో ఇప్పటికే అక్కడ నివాసం ఉంటున్న ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలతో మాట్లాడి అక్కడ వారికి అందుతున్న సౌకర్యాలు, జీవనవిధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రెండు స్థలాలు పరిశీలించామని గ్రామంలో చర్చించి త్వరలో జరిగే గ్రామసభలో తమ నిర్ణయం తెలియజేస్తామని తెలిపారు. తమకు పునరావాసం కల్పించే ప్రాంతంలో ఉపాధి అవకాశాలతో పాటు వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించాలని నిర్వాసితులు కోరారు.

బీమా అమలులో ఉన్నందున పరిహారం చెల్లించాలి

విశాఖ లీగల్ : వినియోగదారునికి బీమా అమలులో ఉన్నందున వ్యక్తి మృతి చెందితే రావలసిన పరిహారాన్ని చెల్లించాలని వినియోగదారుల మండలి న్యాయమూర్తి జి వెంకటేశ్వరి, సభ్యులు పి.విజయ దుర్గ,కే.రమణ బాబులు తీర్పునిచ్చారు. బీమా నిబంధనల ప్రకారం మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు బీమా సోమ్ము, రూ.లక్ష నష్టపరిహారం, రూ.10 వేలు ఖర్చులు ఇవ్వాలని న్యాయమూర్తి ఆ తీర్పులో పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. వినియోగదారుడు కర్రి రమణబాబు అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండల పరిధిలోని బౌరాడ గ్రామ నివాసి. 2016 సెప్టెంబర్ 27వ తేదీన విశాఖలోని ఏవీఎన్ కళాశాల దగ్గర ఆంధ్ర బ్యాంకు వెళ్లారు. ఇండియా ఫస్ట్ ఇన్సూరెన్స్ కంపెనీ సంబంధించి కొన్ని వాయిదా చెల్లించాడు. బీమా తీసుకొని కొన్ని నెలలకే అస్వస్థతతో మృతి చెందాడు. బీమా సౌకర్యం ఉన్నందున తమకు పూర్తి పరిహారం రూ.5 లక్షలు ఇవ్వాలని రమణ బాబు భార్య ఫోరమ్‌ను ఆశ్రయించారు. ఫస్ట్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ముంబాయి, విశాఖపట్నం కార్యాలయం, ఆంధ్రా బ్యాంక్ సంయుక్తంగా పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు తమ తీర్పుని మూడు నెలల్లో అమల పరచాలని వినియోగదారుల ఫోరం బీమా కంపెనీలను ఆదేశించింది. అయినా బీమా కంపెనీ పట్టించుకోలేదు. దీంతో ఫిర్యాదు తరపున న్యాయవాది ఆదారి అప్పారావు శుక్రవారం అమలు పిటిషన్ దాఖలు చేశారు.

జ్వరంతో విద్యార్థి మృతి


మరణించిన వంశీకృష్ణ

కొయ్యూరు: యు.చీడిపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న కె.వంశీకృష్ణ అనే విద్యార్థి అనారోగ్యంతో మరణించాడు. గొందికోటకు చెందిన వంశీకృష్ణ యు.చీడిపాలెం పాఠశాలలో చదువుతున్నాడు. మంగళవారం జ్వరం రావడంతో వార్డెన్,హెచ్ఎంలు యు.చీడిపాలెంలోని పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మందులు ఇచ్చారు. దీంతో వెంటనే తగ్గిన జ్వరం బుధవారం రాత్రి మళ్లీ ఎక్కువైంది. వెంటనే స్పందించిన సిబ్బంది వై.రామవం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వంశీకృష్ణ గురువారం మరణించాడు. పాఠశాల హెచ్ఎం,వార్డెన్ నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు మృతి చెందాడని వంశీకృష్ణ తల్లిదండ్రులు ఆరోపించారు. వైద్య సిబ్బంది శుక్రవారం పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

30 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్


నిందితుడితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం గంజాయితో ఓ వ్యక్తిని జీఆర్పీ అదుపులోకి తీసుకుంది. జీఆర్పీ,ఆర్పీఎఫ్ సిబ్బంది శుక్రవారంస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫాంలపై అనుమానితుల లగేజీలను తనిఖీలు చేశారు. ఆ సమయంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన శుభంకర్ ఝూను లగేజీని తనిఖీ చేయగా.. అందులో 30 కిలోల గంజాయిని గుర్తించారు. ఒడిశాలోని రంభ నుంచి విశాఖపట్నం మీదుగా ఢిల్లీకి గంజాయి రవాణా చేసేందుకు ఆయన ఏర్పాట్లు చేసుకున్నాడు. ఈ క్రమంలో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని.. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సబ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, అప్పలనాయుడు, బాలాజీరావు పాల్గొన్నారు.

సింహాచలం దేవస్థానం ఈవోగా శ్రీనివాసమూర్తి



సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవోగా డిప్యూటీ కలెక్టర్ ఎస్. శ్రీనివాసమూర్తిని నియమిస్తూ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్. కరికల్ వలవెన్ శుక్రవారం జీవో జారీ చేశారు. ఇప్పటివరకు విశాఖ డీఆర్ఓగా పనిచేసిన శ్రీనివాసమూర్తిని సింహాచలం దేవస్థానం ఈవోగా నియమిస్తూ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి ఈనెల 5న ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. దీంతో రెవెన్యూశాఖకి చెందిన శ్రీనివాసమూర్తి ప్రభుత్వానికి రిపోర్టు చేశారు. ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు.

నృత్యోత్సాహం


కథక్ నాట్య గురువులు నళిని, కమిలినిలకు జీవన సాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న ఐలాపురం రాజా తదితరులు


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

మద్దిలపాలెం(విశాఖ): నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో వైశాఖీ నృత్యోత్సవం శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో వైభవంగా ప్రారంభమైయింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, బత్తిన రంగ విక్రమ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఆదాయ పన్నుల మాజీ కమిషనర్ సూదగాని రవిశంకర్, రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఐలాపురం రాజా, అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీకృష్ణ, ఆదాయ పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ శంకర్ పాండే, కేంద్ర పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ ఎన్. మహ్మద్ ఆలీ, వి.వి.రమణమూర్తిలు పాల్గొన్నారు. అనంతరం న్యూఢిల్లీకి చెందిన కథక్ నాట్య నిపుణులు పద్మశ్రీ అవార్డు గ్రహీత నళిని, కమిలీని సోదరీమణుల ద్వయానికి వైశాఖీ జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించారు. అనంతర పురస్కార గ్రహీతలైన నళిని, కమిలీలను ద్వయం కథక్ నాట్య విన్యాసం ప్రేక్షకులను మైమరపించింది. విశాఖకు చెందిన సూదగాని గీతా నారాయణ్ కె.శోభానాయుడు నృత్య పరికల్పన చేసిన కూచిపూడి సంప్రదాయ నృత్యం అందరిని విశేషంగా ఆకట్టుకుంది. హాంగ్‌కాంగ్‌కు చెందిన భరతనాట్య కళాకారిణి రూపా కిరణ్ అద్వితీయం నృత్యంలో అందరిని అలరించింది. దుబాయికి చెందిన శ్రావణి తెన్నేటి కూచిపూడి నృత్యాంశాన్ని అద్భుతంగా ప్రదర్శించి అందరి హృదయాలను దోచుకున్నారు. కేరళకు చెందిన శ్రీ ముద్ర కళా గురుకులం కళా బృందం చిత్రా సుకుమారన్ పర్యావేక్షణలో మోహినీ యాట్టం ప్రదర్శించారు.